# రాగి ఉంగరం

బి.పి. కరుణాకర్



రాత్రి ఏడుగంటలప్పుడు మొదలయిన మా కార్యక్రమం చివరిదశకు వచ్చేసరికి తొమ్మిదయింది. సుబ్బరాజు మాకు ఇచ్చిన సమయం తొమ్మిదిన్నర వరకే! తొమ్మిదన్నరకు అతను సయిదాపేట కాలనీకి వెళ్ళి, పేరంటానికి వెళ్ళిన భార్యాపిల్లలను తీసుకురావాలి. అతను భార్యా విధేయుడు. నేను బ్రహ్మచారిని. నాదీ ఊరు కాదు. కడప. ఐదారు నెలలకు ఒకసారి మా సంస్థ బకాయిలు వసూలు చేసుకోవటానికి హయిదరాబాద్ వస్తుంటాను. వచ్చి

నప్పుడల్లా ఒకటీ, రెండు రోజులు సుబ్బరాజుతో కులాసాగా గడపటం కద్దు అతనూ, నేనూ కలిపి చదువుకున్నాము. అతనికి పెళ్ళయ్యాక అదృష్టం కలిసివచ్చి పట్టిందంతా బంగారమైంది. హయిదరాబాద్ లో ఇల్లు కట్టుకుని స్థిరపడి ఎదిగిపోతున్నాడు. కడపలో నాకు ఇటువంటి కార్యక్రమాలు జరుపుకోవటానికి వీలుండదు ఎంత చిన్నపనిచేసినా మా ఇంటికి వార్త చేరిపోతుంటుంది.

మా కార్యక్రమంలోని మూడో వ్యక్తి పేరు లక్ష్మి. ఆమెకు ఇరవై అయిదు సంవత్సరాలుంటాయేమో. ఎర్రగా పొడుగ్గా సన్నగా ఉంది. అందమైన మనిషేం కాదుగాని ఆకర్షణీయంగా ఉంది. బూడిద రంగు నేతచీరలో సింపుల్ గా ఉంది. మెడ బోసిగా ఉంది. తెల్లటి స్లీవ్ లెస్ రవికె బరువుగా వుంది చేతికి మట్టిగాజులు ఉన్నాయి. కుడిచేతి ఉంగరపు వేలికి రాగి ఉంగరం వుంది. ఆమె పేరుతప్ప, ఆమె వివరాలు సుబ్బరాజు నాకు చెప్పలేదు. రెండు పెగ్గులు పడిన తర్వాత తనంతట తనే ఆమె గురించి చెబుతాడని ఎదురు చూచి నిరుత్సాహపడ్డాను. నేను మూడు పెగ్గులకు మించి ఎక్కువ తాగలేను. లక్ష్మికి మొహమాటం ఎక్కువో లేక తాగటమే కొత్తో తెలియదు. నేను ఎంతో బలవంతం చేస్తే ఒక్క బీరుసీసా పూర్తి చేయటానికి రెండు గంటలు తీసుకుంది. సుబ్బరాజు సంగతి సరేసరి. అతనో పీపా. విచిత్రం ఏమిటంటే అతను ఎంత తాగినా భార్యను చూసే సరికి ఎంత నిషా అయినా చప్పున తగ్గిపోతుంటుంది. అతని భార్యముందు ఎంతో అమాయకుడిలా నటిస్తుంటాడు. అతని చిరుతిళ్ల విషయం ఆవిడకు తెలియదు.

తొమ్మిది దాటక సుబ్బరాజు అన్నీ సర్ది, "నువ్వొక పని చేయి" అన్నాడు.

"ఏమిటది?" అడిగాను.

"లక్ష్మిని నువ్వు తీసుకు వెళ్లు....అని లక్ష్మి వైపు తిరిగి, మావాడితో వెళ్ళటానికి నీకేమైనా అభ్యంతరం ఉందా?" అడిగాడు.

లక్ష్మి నా వంక ఒకసారి చూసింది "మీరు ఏ హోటల్ లో దిగారు?" అడిగింది.

"హోటల్ లో కాదు. మా స్నేహితుడి ఇంటిలో ఉంటున్నాను."

"ఎక్కడ?"

చెప్పాను.

ఆమె నుదుడు ముడ త ఐ పడిఁ ది.

"ప్రస్తుతం మా స్నేహితుడు ఊళ్లో లేడు. ఈ ఉదయాన్నే బెఁగు ళూరు వెళ్ళాడు... నేనొక్కడినే.." అంటుంటే సుబ్బరాజు నామాట లకు అడ్డు వచ్చి. "వెళ్ళు లక్ష్మి" అన్నాడు.

లక్ష్మి తలూపింది.

అతను లేచి నిలబడి," నాకు టయిం అయిపోతుంది ... ఆలస్యం ఐతే మా ఆవిడ తిట్టుకుంటుంది. మిమ్మల్ని కారులో సెంటర్‌లో డ్రాప్ చేస్తాను మీకు సెంటర్‌లో ఆటో రిక్షాగాని టాక్సీగాని దొరుకు తుంది" అన్నాడు.

నేనూ లక్ష్మి లేచి బయటకు వచ్చాము.

సుబ్బరాజు మమ్మల్ని ఏబిడ్స్‌లో డ్రాప్ చేసివెళ్ళిపోయాడు. ఎదురుగా వస్తున్న ఆటో రిక్షాను ఆపి కూర్చు న్నాను. లక్ష్మి రిక్షా ఎక్కటానికి రెండు మూడు క్షణాలు తటపటా యించి చివరకు ఎక్కి కూర్చుంది.

"మారేడ్ పల్లి" అన్నాను.

"ఈస్టా వెస్టా?" అడిగాడు రిక్షా అతను.

చెప్పాను.

రిక్షా కదిలింది. ఆమె దగ్గిరగా జరిగి నడుం చుట్టూ చెయ్యి వేశాను.

"నాతో మారేడ్ పల్లి రావటా నికి నీకు ఎటువంటి అభ్యంతరం లేదుకదా?" అడిగాను.

ఆమె వెంటనే జవాబు చెప్ప లేదు. కొద్ది సేపు ఆగి, "లేదు" అంది నెమ్మదిగా. ఆమె మెడ మీద ముద్దు పెట్టుకున్నాను, ఆమె మెడ చక్కగా పొడుగ్గా ఉంది. రిక్షా వేగం పుంజుకుంది.

లకిడీకాపూల్ దాటిన తర్వాత రిక్షా ఎడమ వయిపుకుతిప్పి ఇరవయి నిమిషాల వరకు చాలా వేగంగా నడిపి ఒక సెంటర్‌లో ఆపాడు రిక్షా అతను. నాకు జంట నగరాల రోడ్ల గురించి అట్టే తెలియక పోయినా మమ్మల్ని రిక్షా అతను సరయిన దారిలో తీసుకు వెళ్ళటం లేదని గ్రహించాను.

"నీకు మారేడ్ పల్లి దారి తెలి యదా?" అడిగాను.

"నాకు క్రొత్త సార్" అన్నాడు

"నీకు దారి తెలియదని ముందే చెప్పి ఉంటే వేరే రిక్షా ఎక్కి ఉండే వాళ్ళం కదా" అన్నాను కోపంగా.

అతను జవాబు చెప్పలేదు. ఇంజనుఆపి అటు ప్రక్కగావచ్చిన ఇద్దరి కుర్రాళ్ళను ఆపి, "సికింద రాబాద్‌కు దారి ఎటు?" అని ఉర్దూలో అడిగాడు.

"నువ్వు ఎక్కడి నుండి ప్యాసింజర్లను తీసుకు వస్తున్నావు?" అడిగాడు ఒకకుర్రాడు.

"ఏర్పోర్టు నుండి"

"ఇది మెహిదీ పట్నం వెళ్ళే రోడ్డు. సికిందరాబాద్ వెళ్ళటానికి ఇది దారి కాదు. వీళ్ళను ఇలా ఎందుకు తీసుకు వచ్చావు?" అని గదమాయించాడు రెండో కుర్రాడు.

"నాకు దారి తెలియదు"

"దారి తెలియని వాడివి రిక్షా ఎందుకు నడుపుతున్నావు? నువ్వు ముందు రిక్షా దిగు....పద పోలీసు స్టేషనుకు... నీకసలు లైసెన్సు ఉందా.... చూపించు.... ఈ ప్రయాణికులు కొత్త వాళ్ళని ఎక్కువ డబ్బులు గుంజుదామని ఎత్తులు వేస్తున్నట్టున్నావు" అని మొదటి కుర్రాడు గొంతు చించుకుని మాట్లాడే సరికి చుట్టు ప్రక్కలజనం గుమికూడ సాగారు. పరిస్థితి అదుపు తప్పుతుందేమోనని భయం వేసింది. నేను జోక్యం కలిగించుకుని కుర్రాళ్ళకి దరికీ సర్ది చెప్పి, "సికిందరాబాద్ కు దారి చెప్పండి" అడిగాను.

చుట్టూ చేరిన జనంలో ఒకతను దారి చెప్పాక రిక్షాను వెనక్కి తిప్పాడు. రిక్షాను వేగంగా తిరిగి లకిడీకా పూల్ తీసుకు వచ్చి, అక్కడ ఆపి మరో రిక్షా అతన్ని అడిగి దారి తెలుసుకుని రిక్షాను స్టార్ట్ చేశాడు. ఆ చెప్పిన వాడు పొరపాటు చెప్పాడో లేక ఇతను సరిగా విన లేదేమోగాని ఈ సారి కూడా రిక్షా దారి తప్పింది. ముందు ఖయిరతా బాద్ తీసుకు వెళ్ళాడు. అటు నుండి బంజారా హిల్స్ బేగం పేట మీదుగా సికిందరాబాద్ తీసుకు వచ్చాడు.

ఇంటి ముందు రిక్షా ఆగాక మీటరు చూశాను ఇరవయి ఏడు రూపాయల పది పయిసలయింది. రిక్షాదిగి పర్సుతీశాను. "ఎంతివ్వమంటావు?" అడిగాను.

"మీకు ఎంత ఇవ్వాలని ఉంటే అంత ఇవ్వండి" అన్నాడు.

"మామూలుగా అయితే ఎంతవుతుంది?"


"నాకు తెలియదండీ"

పర్సులోంచి పది రూపాయల కాయితం తీసి అతనికిచ్చాను. పర్సు తిరిగి జేబులో పెట్టుకుంటూ ఆగాను. రిక్షా కదిలింది.

"మాట" అన్నాను.

రిక్షా ఆగింది.

పర్సులోంచి ఇంకో పది రూపాయల కాయితం తీసి ఆశ్చర్యపోతున్న అతని చేతిలో పెట్టాను.




"థేంక్యూ వెరీమచ్ సార్" అన్నాడు.

రిక్షా ముందుకు వెళ్ళిపోయింది. లక్ష్మి వంక చూశాను. చీకటిలో నిలబడి ఉంది. "రా లక్ష్మి" అంటూ ముందుకు నడిచి వీధితలుపు తాళం తీసి తలుపులు తెరిచాను. లోపలకు నడిచాను. లక్ష్మి లోపలకు వచ్చింది డ్రాయింగ్‌రూం లయిటు స్విచ్ నొక్కాను. ట్యూబ్‌లయిటు వెలిగింది. తలుపులు మూసి టక్ లాగేసుకుంటూ లక్ష్మి దగ్గిరకు వచ్చాను. లక్ష్మి కిటికీ దగ్గర నిలబడి బయటకు చూస్తోంది. బయట నుండి చల్లటిగాలి వీస్తోంది. ఆమె నడుం చుట్టూ చేతులు వేసి దగ్గిరకు లాక్కున్నాను. దూరమవుతున్న ఆటోరిక్షా శబ్దం గాలిలో తేలి వినిపిస్తోంది. ఆమె మెడ ముద్దుపెట్టుకుని, "ఆటోరిక్షా అతను చాలా మంచివాడిలా ఉన్నాడు. అందరూ ఇతనిలా ఉండరు. నీకు అతన్ని చూస్తుంటే జాలి వేయలేదూ?" అడిగాను. ఆమె కిటికీలోంచి బయటకు చూస్తూనే తలూపింది.

"మనల్ని అంత వేగంగా తీసుకువస్తున్నప్పుడు రిక్షాను దేనికైనా గుద్దేస్తాడని భయపడ్డాను. ఇంటికి క్షేమంగా చేరుస్తాడని అనుకోలేదు" అంటూ ఆమెను నాకు అభిముఖంగా తిప్పుకుని ఆగాను. ఆమె కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఆమె నడుం మించి చేతులు తీసేశాను.

ఆమె చేతిరుమాలుతో కన్నీరు

తుడుచుకుంటూ, "ఇప్పుడు ఆటోను దేనికయినా గుద్దిం చేస్తా డని భయంగా ఉంది" అంది.

"మీకు.... అతను తెలుసా?"

ఆమె తలూపి, "అతను నా తమ్ముడు. వాడి పేరు రామకృష్ణ," అని రెండు క్షణాలపాటు మౌనంగా ఉండి, "మాది పేద కుటుంబం. అయిదు సంవత్సరాల క్రిందట మా అమ్మ చనిపోయింది. నాన్న గజ్వేల్‌లో బంట్రోతుగా పని చేసేవాడు. సంవత్సరం క్రిందట పక్షవాతం వచ్చింది, తొమ్మిది నెలల క్రిందట అక్కడినుండి అందరం ఇక్కడకు వచ్చాం. నాన్నను ఆసుపత్రిలో చేర్పించాం. ఆయన పరిస్థితి మెరుగేం కాలేదు. రెండు నెలల పాటు ఆసుపత్రిలో ఉంచి ఇంటికి పంపించేశారు. నాకు మరో ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు రామకృష్ణ కాక ఇంకో తమ్ముడు ఉన్నాడు. నా సంపాదనతో మేమందరం బ్రతకాలి. నా సంపాదన విషయం మా ఇంట్లో ఒక్క రామకృష్ణకే తెలుసు.

ఈ విషయంలో మా ఇద్దరికి ఎన్నో సార్లు తర్జన భర్జనలు జరిగాయి. నేను పదోతరగతి చదువుతూమానేశాను. నాకుఏ ఉద్యోగం దొరుకుతుంది? వారం క్రిందట నాకూ రామకృష్ణకూ ఒక ఒప్పందం కుదిరింది. అదేమిటంటే ఇకనుండి నేనిలా తిరగ కూడదు. వాడి ఆటో రిక్షా తోలి డబ్బులు సంపాదిస్తాడు. వాడి బాధ నేను ఊహించగలను. వాడు సంపాదించి నన్ను పోషించనవసరం లేదు. నాకు వాడి ప్రేమ చాలు.

అయితేవాడికి ఇక్కడి వీధులు, బజార్లు సరిగా తెలియవు డ్రయివింగ్ లయిసెన్స్ లేదు. వాడు వారం నుండి కష్ట పడుతున్నా ఆటో రిక్షా దొరకలేదు. నాకు విసుగెత్తి ఇవేళ సుబ్బరాజుగారికి ఫోను చేశాను. ఆయన నన్ను రమ్మన్నారు. మీరు వచ్చే ముందు నేను ఆయన గారింటికి వచ్చాను. నా కుటుంబ విషయాలు ఆయనకు తెలియవు. గత మూడు నెలలుగా ఆయన నాకు తెలిసినా నావిషయాలు ఆయనతో ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పుడు మీరు దయచేసి నాకో సహాయంచేసి పెట్టండి ఏం లేదుమీరు నన్ను త్వరగా వదిలి పెడితే దారిలో తినటానికి ఏమైనా కొనుక్కుని మా ఇంటికి వెళ్ళిపోతాను.....మూడురోజుల నుండి మేము పస్తులుంటున్నాము మా చిన్న తమ్ముడు మరీ ఆకలికి ఆగలేడండీ" అని అంటూంటే ఆమెకు దుఃఖం ఆగలేదు. •